ప్రజాశక్తి
గురువారం 8 మే 2025
5
శ్రీకాకుళం

వికలాంగులకు ఉచిత డిఎస్‌సి క్రాష్ కోర్సు శిక్షణ

శ్రీకాకుళం : వికలాంగ అభ్యర్థులకు ఉచిత మెగా డిఎస్‌సి క్రాష్ కోర్సు శిక్షణను విజయవాడలో నిర్వహిస్తున్నట్లు వికలాంగుల శాఖ ఎడి కె.కవిత ఒక ప్రకటనలో తెలిపారు. దృష్టి, వినికిడి లోపం, ఆర్థోపెడిక్ తదితర అంగవైకల్యం గల అభ్యర్థులు ఎస్‌జిటి టీచర్ పోస్టులకు అర్హత సాధించేందుకు ఈ శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షణకు దరఖాస్తులను ఈనెల 11వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా స్వీకరించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా mdfc.apefss.in వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కనీసం 40 శాతం అంగవైకల్యం ఉన్న వారు అర్హులని స్పష్టం చేశారు. టెట్ స్కోర్ ఆధారంగా శిక్షణ కోసం ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ప్రత్యేక బోధనా పద్ధతుల్లో శిక్షణ, స్టడీ మెటీరియల్, ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు కల్పించనున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

లోలోపలకు జలం

- పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతలు
- క్రమేణా తగ్గుతున్న నీటిమట్టం నిల్వలు
- అత్యధిక మండలాల్లో అడుగంటిన జలాలు
- తీవ్ర వర్షాభావ పరిస్థితులే కారణమని భావిస్తున్న అధికారులు
- 76 గామాల్లో బోర్ల తవ్వకాలపై నిషేధం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో క్రమేణా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఉక్కపోత, వేసవి తాపంతో అల్లాడిపోతున్న జనానికి తాగునీటి సమస్యలూ తప్పడం లేదు. పెరుగుతున్న ఎండ వేడిమితో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. బోర్లు బావురుమంటున్నాయి. బావులు ఎండిపోతున్నాయి. రాబోయే రోజుల్లో వేసవి తాపం మరింత పెరగనున్న నేపథ్యంలో భూగర్భ జలాలు మరింత అడుగుకు చేరనుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అత్యధిక మండలాల్లో భూగర్భ జలాలు అడుగంటాయి. జిల్లాలో గతేడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ఈ పరిస్థితి తలెత్తిందని అధికారులు భావిస్తున్నారు. రాబోయే రోజుల్లో మరింత ఎండ వేడిమి పెరిగే అవకాశం ఉండడంతో, నీటిని పొదుపుగా వాడుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఎండలు ముదురుతుండడంతో ఈ ఏడాది ఏప్రిల్ నాటికి గణాంకాల ప్రకారం జిల్లాలో నీటిమట్టం నిల్వలు సగటున 7.87 మీటర్ల అడుగున లభ్యమవుతున్నాయి. మార్చిలో జిల్లా సగటు 7.28 మీటర్లుగా ఉంది. నెల రోజుల వ్యవధిలో 0.59 మీటర్ల మేర నీరు అడుగుకి చేరింది. 2024 ఏప్రిల్‌తో పోలిస్తే నీటిమట్టం నిల్వలు కాస్త మెరుగ్గానే ఉన్నాయి. గతేడాది ఏప్రిల్‌లో 7.96 మీటర్ల మేర నీరు లభ్యమైంది. స్వల్పంగా 0.09 మీటర్ల మేర పైకి వచ్చింది. రణస్థలం మండలం పైడిభీమవరం ప్రాంతంలో 33.76 మీటర్ల లోతుకు నీరు చేరింది. నీటి నిల్వలు దారుణంగా పడిపోయిన ప్రాంతాల్లో దాదాపు ప్రతి ఏడాదీ పైడిభీమవరం ఉండగా, ప్రస్తుతం కవిటి మండలం జగతి ఆ స్థానాన్ని ఆక్రమించింది. భూగర్భ జలాల స్థాయి ఆధారంగా నాలుగు కేటగిరీలుగా విభజించారు. భూగర్భ జలాలు మూడు మీటర్లలోపు లభ్యమైతే, దాన్ని సురక్షిత స్థాయిగా పరిగణిస్తారు. మూడు నుంచి ఎనిమిది మీటర్ల మధ్యన నీటి నిల్వలు ఉంటే ఆ జోన్‌ను సాధారణ స్థాయిగా పరిగణిస్తారు. ఎనిమిది నుంచి 15 మీటర్ల మధ్య ఉన్న జోన్‌ను క్లిష్ట జోన్‌గా పరిగణిస్తారు. 15 నుంచి 20 మీటర్ల మధ్య నీరు లభ్యమైతే దాన్ని సంక్లిష్ట స్థాయిగా గుర్తిస్తారు. 20 మీటర్లు దాటినా నీరు లభ్యం కాకుంటే ప్రమాదకర జోన్‌గా నిర్ణయిస్తారు. ఏప్రిల్ ముగిసే నాటికి జిల్లాలోని అత్యధిక మండలాలు సాధారణ స్థాయి జోన్‌లో ఉన్నాయి.

నీటిమట్టం ఆధారంగా మండలాల పరిస్థితి ఇలా...

భూగర్భ జలాలు మూడు మీటర్లలోపు లభ్యమయ్యే సురక్షిత జోన్ మండలాల్లో హిరమండలం, ఎల్ఎన్‌పేట, సరుబుజ్జిలి మండలాలు ఉన్నాయి. సాధారణ స్థాయిలో నీటి నిల్వలు ఉన్న మండలాల్లో శ్రీకాకుళం, టెక్కలి, పొందూరు, పాతపట్నం, మెళియాపుట్టి, నందిగాం, నరసన్నపేట, జలుమూరు, ఇచ్ఛాపురం, ఆమదాలవలస, బూర్జ, జి.సిగడాం, గార మండలాలు ఉన్నాయి. క్లిష్ట జోన్‌లో ఎచ్చెర్ల, కంచిలి, కోటబొమ్మాళి, కొత్తూరు, లావేరు, పలాస, సంతబొమ్మాళి, సారవకోట, వజ్రపుకొత్తూరు, సోంపేట, మండలాలు ఉన్నాయి. సంక్లిష్ట జోన్ జాబితాలో రణస్థలం మండలం, ప్రమాదకర జోన్‌లో కవిటి మండలం ఉన్నాయి.

పెరిగిన వర్షపాతం... తగ్గిన తీవ్రత

గతేడాది నైరుతి రుతుపవనాల సమయంలో కొంతమేర పడిన వర్షాలు నీటిమట్టం నిల్వలు మరింత దిగజారకుండా దోహదపడినట్లు తెలుస్తోంది. జూన్ ఒకటి నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు జిల్లాలో సాధారణ వర్షపాతం కంటే కాస్త అధికంగా వర్షం కురిసింది. జిల్లాలో ఆ సయమంలో సాధారణ వర్షపాతం 696.4 మి.మీ కాగా 780.1 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో నీటిమట్టం నిల్వలు పడిపోవడానికి దారితీసిందన్న అభిప్రాయం వినిపిస్తోంది. నైరుతి రుతుపవనాల సమయంలో అంటే జూన్ ఒకటి నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు జిల్లాలో సాధారణంగా 696.44 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా 699.27 మి.మీ వర్షం పడింది. డిసెంబరులో పలు పర్యాయాలు సంభవించిన అల్పపీడనాల ప్రభావంతో నీటిమట్టం నిల్వలు పెరగడానికి ఉపయోగపడింది.

76 గ్రామాల్లో బోర్ల తవ్వకాలపై నిషేధం

జిల్లాలో 76 గ్రామాల్లో అధిక శాతం భూగర్భ జలాలు వినియోగిస్తున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఇందులో రణస్థలం, లావేరు, జి.సిగడాం, పొందూరు మండలాలకు చెందిన గ్రామాలు ఉన్నాయి. రణస్థలంలో అత్యధికంగా 46 గ్రామాలున్నాయి. లావేరులో 17 గ్రామాలు, పొందూరులో ఆరు, జి.సిగడాంలో ఆరు, ఎచ్చెర్ల మండలంలో ఒక గ్రామం ఉంది. ఆంధ్రప్రదేశ్ వాటర్, ల్యాండ్, ట్రీస్ యాక్ట్ 2002 ప్రకారం వీటిని అధిక భూగర్భ జలాలు వినియోగిస్తున్న గ్రామాల జాబితాలో చేర్చింది. దీంతో తాగునీటి అవసరాలకు తప్ప ఈ గ్రామాల్లో బోర్లు తవ్వకూడదంటూ ఈ ఏడాది ఫిబ్రవరి 28వ తేదీన నోటిఫికేషన్ వెలువరించింది. దీంతోపాటు ఇసుక, గనుల తవ్వకాలు చేపట్టకూడదని సూచించింది.

పీజోమీటరుతో నీటిమట్టం నిల్వలను చూస్తున్న జియోలజిస్టు త్రివేణి

నీటి సంరక్షణ పద్ధతులతో భూగర్భ జలాల పెంపు

పలురకాల నీటి సంరక్షణ చర్యలతో భూగర్భ జలాల నిల్వలను పెంచుకోవచ్చు. ప్రధానంగా పైకప్పు వర్షపు నీటి సంరక్షణ (రూఫ్‌టాప్ హార్వెస్టింగ్) పద్ధతిలో ఇల్లు, భవనం పైకప్పు నుంచి వచ్చిన వర్షపు నీటి ప్రస్తుతం అందుబాబులో ఉన్న టెక్నాలజీతో నీటి రీఛార్జి చేసుకునే అవకాశముంది. ప్రతి ఇంట్లో తాగునీటి అవసరాలకు బోరును తవ్వుకున్నట్లే రీఛార్జి స్ట్రక్చర్‌ను నిర్మించుకోవాలి. అవసరాన్ని బట్టి వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు వర్షపు గుంటలను నిర్మించుకోవాలి. నీటి సంరక్షణకు చేపట్టే చర్యలన్నీ శాస్త్రీయంగా ఉంటేనే ఫలితాలు వస్తాయి.

- బి.రమణమూర్తి,
జిల్లా భూగర్భజలశాఖ అధికారి

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

- రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు
- కలెక్టరేట్ వద్ద ధర్నా

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతు, కౌలురైతుసంఘం నాయకులు, రైతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని ఏపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ డిమాండ్ చేశారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరుతూ రైతు, కౌలురైతుసంఘం ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో మూడింట రెండొంతుల వ్యవసాయం వర్షాధారమని, అదునుకు వర్షాలు పడక... వ్యవసాయం ముందుకు సాగక జిల్లా ప్రజలకు వలసబాట తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో సహజసిద్ధమైన నీటి వనరులు పుష్కలంగా ఉన్నా ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా వినియోగంలోకి రాలేదన్నారు. వంశధార, నాగావళి, మహేంద్రతనయ, బాహుదా వంటి జీవ నదులు, మరెన్నో ఊటగెడ్డలు, వాగుల్లో లభిస్తున్న నీరు వృథాగా సముద్రంలో కలిసిపోతోందన్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి నీటి ప్రాజెక్టులను పూర్తి చేసి సాగు భూములకు నీరందించాలని డిమాండ్ చేశారు.

ధర్మవరం చెరువు ఆక్రమణలు తొలగించి మినీ రిజర్వాయరుగా చేయాలన్నారు. బుడుమూరు నారాయణ సాగరాన్ని మినీ రిజర్వాయరుగా చేయాలని డిమాండ్ చేశారు. మందస చేపిగెడ్డ నీటిని గోపాలసాగరానికి మళ్లించాలన్నారు. తండ్యాం ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలని, పైడిగాం ప్రాజెక్టును ఆధునీకరించాలని కోరారు. ఇప్పటికే కొన్ని ప్రాజెక్టులు మరమ్మతులకు గురై నీటి నిల్వ సామర్థ్యాన్ని కోల్పోయాయని, కాలువలో మట్టి పెల్లలు పడి, గుర్రపుడెక్కలు పెరిగి నీరు ప్రవహించే పరిస్థితి లేకుండా ఉందన్నారు. నారాయణపురం వంటి పురాతన ప్రాజెక్టులూ రైతులకు సాగునీరు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

కుడి, ఎడమ కాలువలు పూడిక పేరుకుపోయి చివరి భూములకు నీరందడం లేదన్నారు. రైతులు ఎన్ని పర్యాయాలు ఆందోళన చేసినా ప్రభుత్వం నుంచి స్పందన లేదని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నా, వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాలకు తగినన్ని నిధులు కేటాయించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. 2025-26 సంవత్సర బడ్జెట్‌లో రూ.18,020 కోట్లు కేటాయించినా, అందులో శ్రీకాకుళం జిల్లాకు నామమాత్రపు కేటాయింపులే మిగిలాయన్నారు. పెండింగ్ ప్రాజెక్టులకు కనీసంగా రూ.రెండు వేల కోట్లు అయినా ఇచ్చి ఈ ఏడాది కొన్ని ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

జిల్లా మొత్తం నీరందించడానికి ఇరిగేషన్ నిపుణులు చెప్పిన ప్రకారంగా రూ.పది వేల కోట్లు దశల వారీగా కేటాయించాలన్నారు. జిల్లాలోని నీటి వనరులను ఉపయోగించుకుని జిల్లాలో శాశ్వతంగా కరువు నివారించే అవకాశం ఉందన్నారు. ధర్నా అనంతరం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో రైతుసంఘం జిల్లా అధ్యక్షులు పి.చంద్రరావు, కె.కొండయ్య, బి.వాసు, ఎం.అజయ్, ముద్దాడ రమణ, రుప్ప ఆదినారాయణ, జె.కృష్ణారావు, అల్లు.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల బృందం తీర ప్రాంతం పరిశీలన

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్, శాస్త్రవేత్తలు

మండలంలోని పెద్దగణగళ్లవానిపేటలో సముద్ర తీర ప్రాంతాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి శాస్త్రవేత్తల బృందం బుధవారం పరిశీలించింది. పెద్దగణగళ్లవానిపేటలో సముద్రంలో నాగావళి నది కలిసిన ప్రాంతంలో మౌత్ క్లోజ్ కావడంతో గ్రామం కోతకు గురై తుపాను, పెద్ద అలల సమయాల్లో ఊరు వైపు దిశ మారుతుందని గ్రామస్తులు ఎమ్మెల్యే శంకర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి లేఖ రాశారు. సముద్రం, ఏరు దిశ మార్పులను పరిశీలించారు. దీనికి సంబంధించి అంచనాలు తయారు చేసి ఎస్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ నిధుల నుంచి పనుల మంజూరు కోసం చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

యాక్సిస్ ఒప్పందాన్ని రద్దు చేయాలి

- విద్యుత్ భారాలను తక్షణమే తగ్గించాలి
- వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

ప్రజాశక్తి - నరసన్నపేట

విద్యుత్ కొనుగోలు పేరుతో ప్రజలపై అదనపు భారం మోపేలా కుదుర్చుకున్న యాక్సిస్ ఎనర్జీ ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నరసన్నపేటలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే పెరిగిన ట్రూ-అప్ ఛార్జీలు, ఎఫ్‌పిపిసిఎ వంటి వాటితో సామాన్యులు తీవ్రంగా నలిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రజలకు ఊరట కల్పించాల్సిన సమయంలో, కేవలం కొందరికి లాభం కలిగించే విధంగా యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో అడ్డగోలుగా ఒప్పందం కుదుర్చుకోవడం దారుణమని విమర్శించారు. గతంలో తిరస్కరించిన ఈ ఒప్పందాన్ని ఇప్పుడు పునరుజ్జీవింపచేయడం వెనుక ఎవరికో మేలు చేయాలనే దురుద్దేశమే ఉందని ఆరోపించారు. దేశవ్యాప్తంగా సోలార్ విద్యుత్ ధరలు పడిపోతున్నా, 25 ఏళ్ల పాటు యూనిట్‌కు రూ.4.60 చెల్లించే ఒప్పందం కుదుర్చుకోవడం వల్ల రాష్ట్ర ప్రజలపై రూ.14 వేల కోట్లకు పైగా అదనపు భారం పడనుందని తెలిపారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమానికి సిద్ధం కావాల్సి ఉంటుందని హెచ్చరించారు. విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, అన్ని రకాల అదనపు ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చే వైసిపి, కూటమి ప్రభుత్వం చేసుకున్న వివాదాస్పద ఒప్పందాలపై పోరాటాన్ని ముమ్మరం చేయనుందని చెప్పారు. సమావేశంలో వైసిపి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్

'ఆపరేషన్ అభ్యాస్' విజయవంతం

శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్‌లో సివిల్ మాక్ డ్రిల్

ప్రజాశక్తి - ఆమదాలవలస

భారత్-పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు జిల్లాలో చేపట్టిన సివిల్ మాక్ డ్రిల్ విజయవంతంగా ముగిసింది. ఆపరేషన్ అభ్యాస్ పేరుతో శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్‌లో బుధవారం చేపట్టిన మాక్ డ్రిల్‌లో పలు విభాగాల సిబ్బంది పాల్గొన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు సైరన్ మోత మోగించి అత్యవసర పరిస్థితుల్లో స్పందించాల్సిన విధానంపై అవగాహనకు మాక్ డ్రిల్ నిర్వహించారు. ఉగ్రవాదులు దాడులు చేసినప్పుడు, ఇతర అత్యవసర పరిస్థితుల సమయంలో సమీపాన పౌరులు స్వీయ రక్షణకు ఎలాంటి చర్యలు చేపట్టాలి, రక్షణ దళాలు ఉగ్రవాదులను ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై మాక్ డ్రిల్ సాగింది. పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక, వైద్యారోగ్యశాఖ, రైల్వే, జిఆర్‌పి, ఐసిడిఎస్, ఇతర శాఖల సమన్వయంతో ఈ సివిల్ మాక్ డ్రిల్‌ను నిర్వహించి ప్రయాణికులు, స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. రైల్వేస్టేషన్, ఇతర పబ్లిక్ ప్రదేశాల్లో ఉగ్రవాద దాడులు చేస్తే అత్యవసర, ప్రమాదకరమైన పరిస్థితులు ఏర్పడినప్పుడు పౌరులు వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సైరన్లు మోగినప్పుడు తక్షణం తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై స్పెషల్ పార్టీ పోలీసులు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, ఫైర్, హెల్త్ సిబ్బంది వెంటనే చేపట్టే చర్యలను మాక్ డ్రిల్ ద్వారా చూపించారు. ప్రమాదం సంభవించిన వెంటనే క్షతగాత్రులను అంబులెన్స్ ద్వారా హాస్పిటల్‌కు ఎలా తరలించాలి, బాంబులు అమర్చిన ప్రాంతాన్ని బాంబు స్క్వాడ్ ద్వారా గుర్తించి వాటిని ఎలా డిస్పోజల్ చేయాలి, ఉగ్రవాదులు, శత్రుమూకలను ఏవిధంగా హతమార్చాలని అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ సాయి ప్రత్యూష, డిఎస్‌పిలు వివేకానంద, శేషాద్రి, జిల్లా అగ్నిమాపక అధికారి జె.విజయకుమార్, ఎస్‌బి సిఐ ఇమ్మాన్యుల్ రాజు, ఆమదాలవలస సిఐ సత్యనారాయణ, ఎస్ఐలు, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోరాట వీరుడు 'అల్లూరి'

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తిని నేటి తరం గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి అన్నారు. అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎస్‌పి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో అల్లూరి చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. బ్రిటిష్ సామ్రాజ్యం దోపిడీని ఎదుర్కోవడానికి మన్యం ప్రజలకు అండగా నిలిచి విప్లవ యోధులుగా తయారు చేసి గిరిజనుల్లో చైతన్యం తీసుకువచ్చిన విప్లవ వీరుడని కొనియాడారు. అల్లూరి సీతారామరాజు గొప్పతనాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి కె.వి రమణ, వి.వెంకట అప్పారావు, డిఎస్‌పి ఎల్.శేషాద్రి, ఎఆ సిహెచ్.గోపీనాథ్, పలువురు సిఐలు, ఆర్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో అల్లూరి చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు, పర్యాటక శాఖ అధికారి నారాయణరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరి చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ఉచిత టైలరింగ్ శిక్షణా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మండలంలోని సింగుపురంలో ఉచిత టైలరింగ్ శిక్షణా కేంద్రాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఇది గొప్ప అవకాశమన్నారు. మూడు నెలల పాటు శిక్షణ పొందిన తర్వాత ఉచితంగా కుట్టు మిషన్ అందించనున్నట్లు చెప్పారు. అనంతరం మహిళలు బృందాలుగా ఏర్పడి అభివృద్ధి చెందవచ్చని చెప్పారు. ఈ పథకం ద్వారా మహిళలు స్వయం ఉపాధిని పొందడమే కాకుండా, వ్యాపార రంగంలోకి అడుగుపెట్టి ఆర్థికంగా స్థిరపడవచ్చన్నారు. కార్యక్రమంలో మహిళలు, ఎన్‌డిఎ కూటమి నాయకులు పాల్గొన్నారు.

రైతుబజారులో షాపుల అద్దెకు బహిరంగ వేలం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

నగరంలోని రైతుబజారులో నూతనంగా నిర్మించిన మూడు షాపులను ఏడాది పాటు అద్దె ప్రాతిపదికన కేటాయించేందుకు ఈనెల 16వ తేదీన బహిరంగ వేలం వేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 15వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటలోపు పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసిన వారికి మాత్రమే వేలంలో పాల్గొనడానికి అర్హత ఉంటుందని స్పష్టం చేశారు. మరిన్ని వివరాల కోసం 7702545514, 9182361328 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కట్టుకున్నోడే కాలయముడు

కత్తితో భార్య పీక కోసిన భర్త

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

కలకాలం కలిసుంటానని, కష్టసుఖాల్లో తోడుంటానని పెళ్లి సమయంలో బాసలు చేసిన కట్టుకున్నోడే కాలయముడయ్యాడు. భార్యను విచక్షణారహితంగా కత్తితో పీక కోసి కడతేర్చాడు. బుధవారం చోటుచేసుకున్న ఈ దారుణ ఘటనలో కోటబొమ్మాళికి చెందిన నర్సిపురం లక్ష్మి (39) మృతి చెందింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం సంతబొమ్మాళి మండలం నర్సాపురానికి చెందిన తిరుపతిరావుతో విశాఖపట్నం జిల్లా మార్కాపురానికి చెందిన లక్ష్మితో 2006లో వివాహమైంది. కొన్నేళ్ల కిందట వారు కోటబొమ్మాళిలోని విద్యుత్ నగర్ కాలనీకి వచ్చి అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. తిరుపతిరావు కేబుల్ ఆపరేటర్‌గా పనిచేస్తుండగా, లక్ష్మి కోటబొమ్మాళిలో హర్షిణి బ్యూటీ పార్లర్, లేడీస్ కార్నర్ నిర్వహిస్తోంది. భార్యాభర్తల మధ్య కొన్నాళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. బుధవారం మధ్యాహ్నం లక్ష్మి నిర్వహిస్తున్న షాపునకు తిరుపతిరావు వెళ్లి ఆమెతో గొడవ పడ్డాడు. మాటకు మాట పెరగడంతో కత్తితో లక్ష్మి కోసి స్థానికంగా ఉన్న మద్యం దుకాణానికి వెళ్లాడు. రక్తపుమడుగులో ఉన్న లక్ష్మిని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఇన్‌ఛార్జి సిఐ విజయ్ కుమార్, ఎస్ఐలు వి.సత్యనారాయణ, రెల్లయ్య సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకునేసరికే ఆమె మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మద్యం దుకాణం వద్ద ఉన్న తిరుపతిరావును పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గతంలోనూ లక్ష్మిపై తిరుపతిరావు దాడి చేసిన ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా ఉంది. లక్ష్మిపై అనుమానంతోనే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని స్థానికులు చెప్తున్నారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు సిఐ విజయ్ కుమార్ తెలిపారు.

రక్తపుమడుగులో విగతజీవిగా పడి ఉన్న లక్ష్మి

టేకు దుంగలను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

నరికిన టేకు చెట్లు పరిశీలన

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని గోపీదేవిపేట గిరిజన గ్రామ సమీపంలో డీ పట్టా భూముల్లో నాలుగు రోజులుగా టేకు చెట్లను నరుకుతున్నారు. ఇటీవల 'ప్రజాశక్తి'లో 'టేకు చెట్ల నరికేస్తున్నారు' అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం రెవెన్యూ, అటవీశాఖ అధికారులకు చెట్లు నరికివేస్తున్న ప్రదేశానికి వెళ్లి దర్యాప్తు చేపట్టారు. మెరక కృష్ణకు 19 చెట్లను 84 ముక్కలుగా, ఎరగడ సూరయ్య రెండు చెట్లను 8 ముక్కలు, కొండంగి దుర్గయ్య ఐదు చెట్లకు 31 ముక్కలు ఉన్నట్లు గుర్తించారు. దర్యాప్తులో విఆర్ఒ ఉమ, సర్వేయర్ సంతోష్, సచివాలయ సర్వేయర్, అటవీశాఖ అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, విఆర్ఎ కుప్పిల మల్లయ్యలు పాల్గొన్నారు. ఈ విషయాన్ని మండలశాఖ అధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు.

సమ్మెను విజయవంతం చేయాలి

కొత్తూరు: ఈ నెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు కె.సూరయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు కొత్తూరులో విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నదన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. 8 గంటల పనిదినాన్ని 12 గంటలకు పెంచిందని దుయ్యబట్టారు. యూనియన్లను ఏర్పాటు చేసుకోవాలంటే కార్మికుల అవసరాన్ని బట్టి కాకుండా అధికారి ఇష్టం ఉంటే యూనియన్ ఏర్పాటు చేయవచ్చు అనే పరిస్థితి ఇప్పి పరిశ్రమ యాజమాన్యాల చేతిలో యూనియన్‌ను పెట్టిందన్నారు. కార్మికుల సమ్మె హక్కును ప్రశ్నార్థకం చేసిందని విమర్శించారు. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు. ఉపాధి హామీ పనులు 200 రోజులు చేపట్టాలని, రూ.600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు పసన రమేష్, డి.అప్పన్న, తవుడు, రమేష్ పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న వివిధ కోర్సుల్లో ఈ విద్యా సంవత్సర ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు, ఈ నెలలో నిర్వహించనున్న సప్లిమెంటరీ పరీక్షల్లో పాల్గొనే విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ముందుగా తమ సీటుని రిజర్వ్ చేసుకునే విద్యార్థులు కళాశాల పనివేళ సమయంలో సంప్రదించాలని తెలిపారు.

నేడు జాబ్‌మేళా

కవిటి: మండల కేంద్రంలోని ఎవిఎన్ విద్యా సంస్థల్లో గురువారం ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ బెందాళం కింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. పేరుపొందిన జోష్ట్, హానర్ ల్యాబ్ లిమిటెడ్ వంటి కంపెనీలు హాజరవుతున్న ఈ జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆధార్ కార్డు, ఇంటర్, డిగ్రీ, ఐటిఐ, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఒరిజినల్, జిరాక్స్ ప్రతులతో అభ్యర్థులు జాబ్‌మేళాకు హాజరుకావాలని సూచించారు.

వీరికి న్యాయం చేయలేరా?

● తిత్లీ పరిహారం కోసం ఎదురుచూపులు ● టిడిపి కూటమి ప్రభుత్వంపై ఆశలు

ప్రజాశక్తి- కవిటి

కవిటి మండలం లోల్లపుట్టుగ గ్రామానికి చెందిన లొల్ల ఎరుకనాయుడు 2018లో సంభవించిన తిత్లీ తుపానకు తనకున్న మూడు ఎకరాల్లో అందరిలాగే నష్టాన్ని చవిచూశాడు. సుమారు 70 కొబ్బరి చెట్లు నేల కొరిగాయి. ప్రభుత్వ అధికారులు నష్టపరిహారం అంచనా వేసినప్పుడు తనకు జరిగిన నష్టం వారికి తెలియజేయడమే కాకుండా తన భూమికి సంబంధించిన పూర్తి సమాచారం నఖలు రూపంలో వారికి అందించారు. అయితే అప్పటి టిడిపి ప్రభుత్వంలో కానీ, ఆ తరువాత వచ్చిన వైసిపి ప్రభుత్వంలో కానీ అతనికి ఒక్క రూపాయి నష్టపరిహారం అందలేదు. దీనిపై ఎందరు అధికారులను సంప్రదించినా, ఎన్ని ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోయింది. చివరికి నేటి వరకు కూడా ఆయనకు నష్టపరిహారం అందకపోగా ఎప్పటికైనా తనకు న్యాయంగా రావాల్సిన పరిహారం అందుతుందేమోనన్న ఆశ ఆయన్ని వీడలేదు. ఇటువంటి సంఘటనలు ఉద్దానం ప్రాంతంలో చాలా ఉన్నాయి. దానికి ఉదాహరణ ఎరుకు నాయుడు.

2018 అక్టోబరు నెలలో సంభవించిన తిత్లీ తుపాను ఉద్దానం రైతాంగానికి పీడకలగా మిగిలింది. కొన్ని వేల చెట్లు నేలకూలాగా, కొన్ని వందల మంది నిరాశ్రయులయ్యారు. ఈ సంఘటనకు వెంటనే

తిత్లీ తుపానుకు నేలకొరిగిన కొబ్బరి చెట్లు (ఫైల్)

అప్రమత్తమైన అప్పటి టిడిపి ప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలని సదుద్దేశంతో వెంటనే నష్టపరిహారం అంచనా వేయడమే కాకుండా నెల రోజుల్లోనే నష్టపరిహారం పంపిణీ కూడా చేసింది. అయితే అక్కడే సమస్య ఏర్పడింది. ఆగమేఘాలతో చేసిన ఈ సర్వేలో కొన్ని సాంకేతిక కారణాలతో కొందరు పరిహారానికి దూరమైతే మరికొన్ని స్థానిక కారణాలతో మరికొందరు పరిహారం అందుకోలేకపోయారు. అదే సమయంలో కొందరు అనర్హులకు పరిహారం అందిందనే ప్రచారం కూడా జోరుగా సాగింది. ఏదేమైనా చాలామంది అర్హులు ఇప్పటికీ న్యాయంగా తమకు రావలసిన పరిహారం కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు.

ఏడేళ్లుగా ఎదురుచూపులు

2019 ఎన్నికల తర్వాత టిడిపి ప్రభుత్వం మారి వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. తాము అధికారంలోకి వస్తే తిత్లీ నష్టపరిహారం పెంచి ఇస్తామని చెప్పిన జగన్మోహన్‌రెడ్డి కొంత కాలయాపన చేసినా నష్టపరిహారం పంపిణీ చేశారు. అదీ గతంలో ఎవరికి అందిందో వారికే మళ్లీ జమ చేశారు. పూర్తిగా అందని వారికి, కొన్ని సాంకేతిక కారణాలతో పరిహారానికి దూరమైన వారికి మళ్లీ మొండిచేయి మిగిలింది. ఇక అప్పటి నుంచి రైతు సంఘాలు, బాధిత రైతులు తమకు న్యాయం చేయాలంటూ అధికారులు ప్రభుత్వాలు చుట్టూ తిరగడం, చేస్తాం చూస్తాం అంటూ వారు కాలయాపన చేయడమే జరిగింది తప్పించి నిజంగా నష్టపరిహారం అందని వారికి మాత్రం ఇప్పటికీ పరిహారం అందని ద్రాక్షగానే మిగిలింది. 2024లో మళ్లీ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొంతమంది రైతు ప్రతినిధులు జిల్లాకు చెందిన మంత్రి అచ్చెన్నాయుడు, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి ఈ సమస్య తీసుకెళ్లారు. దీంతో ఏదోమూల మిణుకుమిణుకుమంటున్న బాధిత రైతుల ఆశలు మళ్లీ చిగురించాయి. అయితే ఇది జరిగి నెలలు గడుస్తున్నా దీనిపై కదలిక లేకపోవడం మరోవైపు వారిలో నిరాశ ఆవహిస్తోంది.

6,611 మందికి అందలేదు

ఉద్యానవనశాఖ అధికారుల లెక్క ప్రకారం సుమారు 6611 మంది రైతులకు నష్టపరిహారం అందలేదని ప్రభుత్వానికి నివేదిక అందించారు. అయితే వాస్తవానికి వీరిలో ఇంకా నష్టపరిహారం అందని వారి పేర్లు చాలా లేవు. ఉదాహరణకి కవిటి మండలం ప్రగడపుట్టుగకు చెందిన రైతుకు కవిటి, పుటియాదళ, కపాసుకుద్ది రెవెన్యూ పరిధిలో నాలుగున్నర ఎకరాల భూమి ఉంది. అయితే అతనికి పుటియాదల రెవెన్యూ పరిధిలో ఉన్న 42 సెంట్లు భూమికి మాత్రమే నష్టపరిహారం అందింది. మిగతా రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న నాలుగు ఎకరాల భూమికి రూపాయి పరిహారం ఇప్పటికీ అందలేదు. కానీ, ప్రభుత్వ లెక్కల ప్రకారం అతనికి పరిహారం అందినట్టే రికార్డు చేశారు. ఇటువంటి బాధితులు మరి కొంతమంది ఉద్దానం ప్రాంతంలో ఉన్నారు. రైతుకు న్యాయం చేయాలని సదుద్దేశంతో అప్పటి టిడిపి ప్రభుత్వం చేసిన ప్రయత్నం మరోసారి చేయాలని తమలాంటి అర్హుల వివరాలు పూర్తిస్థాయిలో సేకరించి తమకు న్యాయం చేయాలని ఉద్దానం ప్రాంతంలోని తిత్లీ బాధిత రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

ఎదురుచూస్తూనే ఉన్నా

గత ఆరేళ్లుగా తిత్లీ పరిహారం కోసం ఎదురు చూస్తూనే ఉన్నాను. ఎందుకు నాకు పరిహారం రాలేదో ఇప్పటికీ అర్థం కావడం లేదు. నాలాంటి సన్నకారు రైతుకు న్యాయం చేయాల్సిన బాధ్యత అటు అధికారులు ఇటు ప్రభుత్వానికి ఉంది. అయితే రైతు సంక్షేమం దృష్టిలో ఉంచుకొని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే పరిహారం అందించే ఏర్పాటు చేశారు. కొన్ని సాంకేతిక కారణాలతో మాలాంటి వాళ్లు అన్యాయానికి గురయ్యారు. మళ్లీ అతనే ముఖ్యమంత్రిగా రావడంతో నాలాంటి వాళ్ల ఆశలు మళ్లీ చిగురించాయి. మేము ఎవరిదో అడగడం లేదు. న్యాయంగా మాకు రావలసిన నష్టపరిహారం కోరుతున్నాం. అధికారులు, నాయకులు స్పందించి నాలాంటి బడుగుజీవులకు న్యాయం చేయాలని కోరుతున్నాం.

- లోల్ల ఏరుకునాయుడు, రైతు, లోల్లపుట్టుగ

నివేదిక అందించాం

జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తిత్లీ పరిహారం అందని బాధితుల పేర్లు నివేదికతో సహా గతంలోనే ఉన్నతాధికారులకు అందించాం. అప్పటి పరిస్థితులు బట్టి అందరికీ న్యాయం చేయడం జరిగింది. కొన్ని సాంకేతిక కారణాలతో కొంతమంది పరిహారం అందుకోలేకపోయారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడతాం.

- పోలాకి మాధవీలత, ఉద్యాన శాఖ అధికారి, కవిటి

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు

ఆమదాలవలస : సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు తాడి సంతోష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో ఈ నెల 20వ తేదీన చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మె నోటీసును పురపాలక సంఘ మేనేజర్ లక్ష్మీనారాయణ బిషోయ్‌కు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 20న సమ్మె, 21,22న కార్మికుల సానిక డిమాండ్లను పరిష్కరించాలని సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికులను కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ రద్దు చేసి ప్రయివేట్ ఏజెన్సీలకు అప్పగించాలన్న నిర్ణయాన్ని విరమించుకోవాలన్నారు. మున్సిపల్ పారిశుధ్య ఇంజనీరింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. వయో పరిమితిని 62 ఏళ్లకు పెంచి రిటైర్మెంట్ బెనిఫిట్లు, గ్రాట్యూటీ చెల్లించాలని అన్నారు. గతంలో 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలకు వెంటనే జిఒలను జారీ చేయాలన్నారు. 12వ పిఆర్‌సి కమిటీని వెంటనే నియమించి మున్సిపల్ కార్మికులకు జిఒ నంబరు 1615ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు తారక్ వెంకటరావు, భాస్కరరావు, మంగమ్మ, రాములమ్మ, సత్యవతి, రాధ పాల్గొన్నారు.

పలాస : ఈ నెల 20న నిర్వహించనున్న సమ్మెలో మున్సిపల్ కార్మికులు పాల్గొవాలని సిఐటియు నాయకులు ఎన్.గణపతి పిలుపునిచ్చారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన కమిషనర్ ఎన్.రామారావుకు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు యం.రవి, కె.వెంకట్, కె.భాస్కరరావు, ఎస్.తిరుపతి పాల్గొన్నారు.

అలాగే ఐసిడిఎస్ పిఒ పార్వతికి అంగన్వాడీ కార్యకర్తలు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు ఆర్అప్పలనరసమ్మ, జయలక్ష్మి, రాజేశ్వరి పాల్గొన్నారు. అలాగే సమ్మెను విజయవంతం చేయాలని పిసిఎంఎ (పలాస జీడి పరిశ్రమల సంఘం) అధ్యక్షుడు మల్లా శ్రీనివాసరావుకు సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, కాష్యూ లేబర్ అసోసియేషన్ లేబర్ కాలనీ కార్యదర్శి అంబటి ఆనందరావు కోరారు. సమ్మెకు సంబంధించిన నోటీసును అందజేశారు. పరిశ్రమలను నిలిపి వేసి కార్మికులకు అండగా నిలవాలని కోరారు.

పలాస : సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మికులు

ఇప్పిలిలో వృద్ధుడు హత్య

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

నర్సింగరావు మృతదేహం

మండలం ఇప్పిలిలో బుధవారం వేకువ జామున దారుణం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కరణం నర్సింగరావు (63) తన నివాసంలోని మంగళ వారం రాత్రి డాబాపై నిద్రిస్తుండగా గుర్తు తెలియని దుండగులు బుధవారం తెల్లవారుజామున హత్య చేశారు. ఉదయం నిద్రలేచి చూడగా నర్సింగరావు రక్తపు మడుగులో విగతజీవుడై పడి ఉండటాన్ని గుర్తించారు. వెంటనే రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ కె.రాము తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం సిఐ పైడపు నాయుడు కూడా అక్కడికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య యశోద, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కాగా, మంగళవారం రాత్రి గ్రామంలోని రమణ అనే వ్యక్తితో చిన్నపాటి ఘర్షణ చోటు చేసుందని గ్రామస్తులు చెబుతున్నారు. మృతుడి ఇంటి ముందు రమణ బైక్ పెట్టడంతో వారి మధ్య వాగ్దానం చోటు చేసుకుంది. అనంతరం స్థానికులు ఇద్దరిని సర్దిచెప్పి ఎవరి ఇంటికి వాళ్లను పంపించేశారు. తెల్లవారుజామున లేచి చూసేసరికి నర్సింగరావు మృతి చెందడం, రమణ కనిపించకపోవడంతో అతనిపైన అనుమానాలు చోటుచేసుకున్నాయి క్లూస్ టీం ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళకు జైలు శిక్ష

వజ్రపుకొత్తూరు: మండలంలోని గునుపల్లికి చెందిన మహిళ అక్రమ నాటుసాయి విక్రయం కేసులో నేరం రుజువు కావడంతో జైలుశిక్ష ఖరారైందని పలాస ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.మల్లిఖార్జునరావు తెలిపారు. ఈ మేరకు పలాస మున్సిబ్ కోర్టు జడ్జి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. నిందితురాలకు 12 నెలలు శిక్ష, రూ.రెండు లక్షలు జరిమానా విధించారని అన్నారు. 2021 నవంబరు 29న 6.5 లీటర్ల నాటుసారా ఆమె కలిగి ఉండటంతో అప్పటి ఎక్సైజ్ ఎస్ఐ కె.కృష్ణారావు కేసు నమోదు చేశారని తెలిపారు.

71 ఏళ్లలోనూ చదువుపై శ్రద్ధ

ప్రజాశక్తి- కవిటి

జ్ఞానానంద

చదువుపై జిజ్ఞాస, నేర్చుకోవాలనే ఆశక్తి ఉండాలే కానీ వయసుతో సంబంధం లేదని మరోమారు రుజువైంది. కవిటి గ్రామానికి చెందిన బందరు జ్ఞానానంద తన 71వ ఏట ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన సంస్కృత భారతి రెండేళ్ల కోర్సులో ప్రవేశ, శిక్ష, పరీక్ష, కోవిడ్ అనే నాలుగు అంశాల్లో ఆన్‌లైన్ ద్వారా శిక్షణ పొంది పరీక్షలు రాశారు. దీనికి సంబంధించి ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఆయన ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. విశ్రాంత హోమియో వైద్యుడైన జ్ఞానానంద హైదరాబాద్, విశాఖపట్నం, విజయనగరంలో వైద్య సేవలు అందిస్తున్నారు. నెలలో ఒకరోజు తన సొంత గ్రామమైన కవిటిలో కిడ్నీ రోగులకు చికిత్స అందిస్తున్నారు. బిఎస్‌సి బిఇడితో పాటు బిహెచ్ఎంఎస్, ఎండి ఇన్ హోమియో చేసిన డాక్టర్ జ్ఞానానంద మలిసంధ్యవేళలో చదువుపై చూపించిన శ్రద్ధ - ఆసక్తి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

మార్గనిర్దేశకుడు తవిటయ్య

ప్రజాశక్తి- శ్రీకాకుళం

వ్యాపార వేత్తగా, రాజకీయ నాయకునిగా నగర ప్రజలకు మార్గ నిర్దేశకుడు అంధవరపు తవిటయ్యా అని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలో వ్యాపార కేంద్రంగా పొట్టి శ్రీరాములు మార్కెట్ అవతరించిందని పేర్కొన్నారు. నగరంలోని పొట్టి శ్రీరాములు మార్కెట్లో నిర్మించిన తవిటయ్య విగ్రహానికి బుధవారం పూలమాల వేసి నివాళ్లర్పించారు. అటువంటి మహనీయులను ఎల్లప్పుడు గుర్తు చేసుకునేలా నగరంలో ప్రత్యేక స్థానం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కళింగ కోమటి సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోయిన గోవిందరాజులు, నగర వర్తక సంఘం అధ్యక్షులు కోరాడ హరిగోపాల్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి, కళింగ కోమటి కార్పొరేషన్ మాజీ చైర్మన్ అంధవరపు సూరిబాబు, అంధవరపు ప్రసాద్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

కూలీలతో మాట్లాడుతున్న అప్పన్న

కొత్తూరు: ఉపాధి కూలీలకు పనిప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదివాజీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని గొట్టిపల్లి పంచాయతీలో చేస్తున్న ఉపాధి హామీల పనుల వద్ద గమేలాలను తొలపై పెట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనిలో టెంటు సౌకర్యం, ఒఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ, మెడికల్ కిట్ బాక్స్ ఇతర సదుపాయాలు లేవని అన్నారు. దీంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రెండు పూటలు పని కావడం వల్ల ఎండ తీవ్రతకు తట్టుకోలేకపోతున్నారని అన్నారు. ఉపాధి కూలీలు నిమ్మక పొట్టమ్మ, నిమ్మక ఆరుద్రమ్మ, గేదెల రవణమ్మ, ఆరిక శివ, ఆరిక సిమ్మన్న, ఆరిక దండాశి పాల్గొన్నారు.

క్రీడలకు ప్రాధాన్యం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

విద్యార్థులు క్రీడల్లో పాల్గొనేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని జ్ఞాన భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కార్యదర్శి, ముఖ్య కార్యనిర్వాహణాధికారి జోహార్‌ఖాన్ పిలుపునిచ్చారు. ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవం సందర్భంగా పాఠశాల ఆవరణలో బుధవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుతం పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణా శిబిరాలకు హాజరవుతున్న విద్యార్థులతో మాట్లాడారు. విద్యకు, పాఠ్యాంశాలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్న ప్రస్తుతతరం విద్యార్థులు క్రీడల్లో పాల్గొనేందుకు సమయం కేటాయించాలన్నారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక దారుఢ్యంతో పాటు, మానసిక దారుఢ్యం కూడా లభిస్తుందన్నారు. జ్ఞాన భారతి పాఠశాల క్రీడలకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఎన్నో జాతీయ క్రీడా పోటీలకు ఆతిథ్యం కూడా ఇస్తామన్నారు. ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వజ్రపు రమణమూర్తి శరీరానికి కావాల్సిన విటమిన్లు పొందడంలో ఆహారపు అలవాట్లు, క్రీడలు ఎలా దోహదం చేస్తాయో వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఐ.బి.పండా, ప్రధానోపాధ్యాయులు రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్‌కుమార్, అదనపు పరిపాలన అధికారిని సయ్యదాసుల్తానా, ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ అలీమ్‌ఖాన్, వ్యాయామ ఉపాధ్యాయులు కైలాస్ పండా, బి.రామచంద్రరెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జోహార్‌ఖాన్

కార్మిక చట్టాలపై అవగాహన

ఇచ్ఛాపురం : కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి పి.పరీష్‌కుమార్ అన్నారు. మేడే వారోత్సవాలను పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికుల పనికాలం, ఇన్సూరెన్స్ వినియోగంపై వివరించారు. ఆటోలో నిబంధనలకు మించి ప్రజలను ఎక్కించరాదన్నారు. న్యాయవాది, యువ ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాంబాబు మాట్లాడుతూ లేబర్ లాస్ కోసం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పిఎల్‌వి పద్మనాభం, అంగన్వాడీ కార్యకర్తలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మాట్లాడుతున్న అప్పలనాయుడు

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ ప్రతినిధి సనపల అప్పలనాయుడు అన్నారు. మండలంలోని కొర్లకోట లో రామ మందిరం వద్ద స్వచ్ఛతే కళా జాతర బుర్రకథను బుధవారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రతినిధి సనపల అప్పలనాయుడు గ్రీన్ అంబాసిడర్లు ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ చేపట్టారు. తడి,పొడి చెత్తపై అవగాహన కల్పించారు. తడిపొడి చెత్తను వేర్వేరుగా చెత్త బుట్టల్లో వేసి పారిశుధ్య కార్మికులకు అందించాలని కోరారు. గ్రామంలో బహిరంగ మల విసర్జన చేయవద్దని, చెత్త వేయవద్దని విజ్ఞప్తి చేసారు. కార్యక్రమంలో ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు, కార్యదర్శి రుప్ప విజయసాగర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలంలోని చీమలవలస పంచాయతీలో స్వచ్ఛ భారత్‌లో భాగంగా ఇంటింటా తడి, పొడి చెత్తను వేరుచేసి చెత్త సేకరణ చేపట్టారు. పరిశుభ్రత పాటించడం కోసం ప్రభుత్వం కళాజాతా కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి బగాది కృష్ణ కుమార్, ఎంఆర్‌సి కామేశ్వరరావు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

మంత్రికి వివరిస్తున్న సంఘ నాయకులు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

నాయీబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని నిమ్మాడ తన క్యాంపు కార్యాలయంలో జిల్లా నాయీబ్రాహ్మణుల సంఘ నాయకులు కుప్పిలి వెంకటరావు అధ్యక్షతన శ్రీకాకుళం పట్టణం, టెక్కలి నియోజకవర్గ నాయీబ్రాహ్మణ సంఘ నాయకులతో కలిసి పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని బుధవారం మంత్రికి అందజేశారు. జిల్లా కేంద్రంలో ప్రత్యేక సామాజిక భవనం నూతనంగా అన్ని హంగులతో నిర్మించాలని కోరారు. యువత నేర్చుకొనేందుకు సంగీత కళాశాల, ఆలయ ట్రస్టు బోర్డులో పని చేస్తున్న వారికి ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలన్నారు. బిసి కార్పొరేషన్ రుణాల్లో ప్రత్యేక కోటా ఇవ్వాలని కోరారు. దీనిపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందిస్తూ ఇప్పటికే నాయీబ్రాహ్మణులకు కొన్ని సదుపాయాలు కల్పించామని, మగిలినవి కూడా త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా నాయీబ్రాహ్మణుల ఉపాధ్యక్షుడు నౌగాపు నాగరాజు, శ్రీకాకుళం పట్టణ అధ్యక్షుడు కుప్పిలి నాగరాజు, టిడిపి నియోజకవర్గ సాధకారిక పార్టీ కన్వీనర్ తెలగవలస అప్పన్న, ఇప్పిలి ఈశ్వరరావు, గోరింక శ్రీను, జమ్ము రవికుమార్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

ప్రజాశక్తి- పలాస

పలాస నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నానని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఎమ్మెల్యే ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం ప్రజల నుంచి పిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వజ్రపుకొత్తూరు మండలం పూడి లంక నిర్మాణానికి నిధులు మంజూరుకు కృషి చేస్తానని, ఆ ప్రాంత ప్రజల ఆకాంక్షను సఫలం చేస్తున్నాని గర్వంగా ఉందని అన్నారు. గత ప్రభుత్వం మాటలు చెప్పుకుంటూ కాలయాపన చేసేరే తప్ప ప్రజలకు ఎటువంటి ప్రయోజనం కలగలేదన్నారు. నియోజకవర్గంలో ఎక్కడా ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు.

అన్నీ వార్డులనూ అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. 18వ వార్డు ఐటిఐ రోడ్డులో రూ.7.30 లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డు, 4వ వార్డు మీలగారంపాడులో రూ.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న కంకర రోడ్డుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, కమిషనర్ ఎన్.రామారావు, టిడిపి నాయకులు లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, ఎం.నరేంద్ర, మల్లా శ్రీనివాస్, ఎ.రామకృష్ణ, సత్యం, నర్సింహులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

మహిళలకు అన్ని రంగాల్లో అవకాశాలు ప్రభుత్వం కల్పిస్తుందని ఎమ్మెల్యే శిరీష అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళలకు కుట్టుమిషన్ శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా సంపాదించుకోగలిగితే ఆ కుటుంబానికి మేలు కలుగుతుందని నమ్మిన వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మహిళలకు ఆర్థిక సంపాదన, స్వేచ్ఛ ఉండాలనే ఉద్దేశంతో ఆనాడు డ్వాక్రా సంఘాలను చంద్రబాబు ఏర్పాటు చేశారన్నారు. పలాసలో 500 మందికి 90 రోజుల పాటు టైలరింగ్ శిక్షణ ఇచ్చి మహిళలను ఆర్థికంగా బలోపేతానికి కృషి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.వసంత్ కుమార్, వెలుగు ఎపిఎం జాంభవంతి, టిడిపి నాయకులు పి.విఠల్, లొడగల కామేశ్వరరావు, కుత్తుము లక్ష్మణకుమార్, బమ్మిడి సంతోష్, వంకట కూర్మారావు పాల్గొన్నారు.

వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

క్రికెట్ టోర్నీ విజేత జెఎస్ఆర్

నౌపడ : సంతబొమ్మాళి మండలం నౌపడ ప్రభుత్వ కళాశాల మైదానంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో సింగి మహంతిపేటకు చెందిన జెఎస్ఆర్ జట్టు విజేతగా నిలిచింది. బుధవారం నిర్వహించిన తుదిపోరులో సీతానగరం రన్నర్‌గా నిలిచి ద్వితీయ బహుమతి గెలుచుకుంది. 20 రోజులుగా నిర్వహిస్తున్న పోటీల్లో 40 జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు ట్రోఫీతో పాటు రూ.20 వేలు నగదు, ద్వితీయ బహుమతికి ట్రోఫీతో పాటు రూ.15 వేలు నగదు బహుమతిని నౌపడ టిడిపి నాయకులు సుగ్గు శాంతి స్వరూప్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ క్రికెట్ క్లబ్ నిర్వాహకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ట్రోఫీని అందజేస్తున్న శాంతిస్వరూప్‌రెడ్డి

రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

లావేరు : మండలంలోని అర్హులు ప్రభుత్వం కల్పించిన కొత్తరేషన్ కార్డులకు గురువారం ఆయా గ్రామ సచివాలయల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ మంగం రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా రేషన్ కార్డు కావాల్సిన వారు ఇప్పటికే ఉన్న కార్డులో కొత్తగా సభ్యుల చేరిక, విభజన, సభ్యుల తొలగింపు, సమర్పణ, చిరునామా చేర్పులు, మార్పులకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అభివృద్ధిని ఓర్వలేకపోతున్నారు

పొందూరు: కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి వైసిపి నాయకులు ఓర్వలేకపోతున్నారని టిడిపి మండల అధ్యక్షులు చిగులపల్లి రామ్మోహన్ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ కనీసం వార్డు సభ్యునిగా ఎన్నిక కాలేని వ్యక్తిని నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించిన పార్టీ వైసిపి అని ఎద్దేవా చేశారు. పియుసి చైర్మన్ కూన రవికుమార్‌ను చర్చకు రావాలని మాట్లాడుతున్న చింతాడకు రవికుమార్‌కు ఆయనతో చర్చించే స్థాయి ఉందా? అని ప్రశ్నించారు. వార్డు సభ్యులతో చర్చించే స్థాయి కూడా నీది కాదని విమర్శించారు. వైసిపి ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాలను ప్రశ్నించలేని చింతాడకు అవినీతికి ఆమడదూరం పాటించే రవికుమార్‌ను విమర్శించే హక్కు లేదన్నారు. గ్రామాల్లో విస్తృతంగా చేపడుతున్న అభివృద్ధిని అడ్డుకుంటే చింతాడతో పాటు వైసిపి నాయకులను గ్రామాల్లో తిరగనీయమని హెచ్చరించారు. ప్రారంభంకాని పథకాల్లో అవినీతి జరిగిందని విమర్శించే అవివేకి చింతాడ అని అన్నారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ అన్నెపు రాము, జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి సీపాన శ్రీరంగనాయకులు, జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బి.శంకర్ భాస్కర్, మండల ఉపాధ్యక్షులు బాడాన శేషగిరి, నాయకులు శ్రీనివాసరావు, భవాని పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రామ్మోహన్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

ఉత్సవాలపై ఎమ్మెల్యే సమీక్ష

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లా కేంద్రమైన పాతశ్రీకాకుళంలో మంగళవారం రాత్రి నుంచి ప్రారంభమై వచ్చే నెల 11 వరకు కొనసాగనున్న సిరిమాను ఉత్సవాలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉత్సవ కమిటీ సభ్యులతో కమిషనర్ ప్రసాదరావు, ఇతరశాఖల ఉద్యోగులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానంగా సిరిమాను తిరగడానికి అవసరమైన రహదారికి అడ్డంగా ఉన్న విద్యుత్, కేబుల్ లైన్సు తొలగించాలని సూచించారు. ఎప్పటికప్పుడు పరిశుభ్రత పాటించాలన్నారు. తాగునీటి కొరత లేకుండా నిరంతరాయంగా తాగునీరందించాలన్నారు. ట్రాఫిక్‌ను 80 అడుగుల రోడ్డులోకి మళ్లించాలన్నారు. పోలీసులు శాంతిభద్రతల విషయంతో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడా అవాంచనీయ ఘటనలు తావులేకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ మేరీకేథరీన్, అగ్నిమాపకశాఖ, విద్యుత్, దేవదాయ శాఖ అధికారులు, ఎస్ఐ హరికృష్ణ, కమిటీ సభ్యులు నక్క శంకరరావు, డాక్టర్ శివప్రసాద్, మావూరి శేఖర్, జి.పాపారావు, డి.మల్లిబాబు, కల్లేపల్లి సోంబాబు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి కృషి

నగర వాసులు సేదతీరేందుకు వీలుగా పార్కులను అభివృద్ధి చేస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. నగరంలోని పుణ్యపు వీధిలో ఉన్న పార్కు, క్రీడా మైదానాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాయంకాల వేళలో వృద్ధులు, చిన్నారులు సేదతీరేందుకు ఈ పార్కులు ఉపయోగపడుతున్నాయన్నారు. వ్యాయామాలు, క్రీడలకు ఉపయోగించుకోవచ్చని సూచించారు.

బహుమతులను అందజేస్తున్న గోవిందరాజులు

బాలికలు విద్యలో ముందుండాలి

ఉప విద్యాశాఖాధికారి విలియమ్స్

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

బాలికలు విద్యలో మరింత ముందుకు సాగాలని టెక్కలి ఉప విద్యా శాఖాధికారి పి.విలియమ్స్ పేర్కొన్నారు. కోటబొమ్మాళి బాలికోన్నత పాఠశాల ప్రాంగణంలో పదో తరగతి పరీక్షల్లో 14 మంది అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులకు బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఉంటూ 577 మార్కులు సాధించినందుకు ఆ విద్యార్థినికి ఈ సువర్ణ అవకాశం దక్కనుందని పేర్కొన్నారు. ఈ పాఠశాలలో మంచి బోధకులు, వసతి సౌకర్యాలు ఉన్నాయని అన్నారు. ఎ ఈ బాలికల పాఠశాల ఏర్పాటుకు తన సొంత స్థలాన్నిచ్చి విశేష కృషి చేసిన స్థలదాత బోయిన గోవిందరాజులును ప్రశంసలతో ముంచెత్తారు. కార్యక్రమంలో హెచ్ఎం చిలుకూరి రమాదేవి, మాజీ సర్పంచ్‌లు కల్లి లక్ష్మణరెడ్డి, కమ్మకట్టు అప్పలరాజురెడ్డి, దేవాది సింహాద్రమ్మ, మాజీ వైస్ ఎంపిపి నాగయ్యరెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ జీరు గణేష్, కోరాడ గోవిందరావు, తంగుడు కృష్ణస్వామి పాల్గొన్నారు.

చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దుర్గారావు

చిరస్మరణీయుడు సంజీవయ్య

ప్రజాశక్తి- శ్రీకాకుళం

మాజీ ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా దామోదర సంజీవయ్య అనేక సేవలందించారని ఎస్‌సి, ఎస్‌టి టీచర్స్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు పోతల దుర్గారావు కొనియాడారు. నగరంలోని సంజీవయ్య మెమోరియల్ కార్యాలయంలో ఆయన వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముందుగా సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిస్వార్థ రాజకీయ నాయకునిగా సేవలందించిన ఆయన ఆలిండియా కాంగ్రెస్ అధ్యక్షునిగా పనిచేసే అవకాశం ఆయనకు దక్కిందన్నారు. పేద బడుగు, బలహీన తరగతుల ప్రజలకు అనేక సంస్కరణలతో పాటు సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. కార్యక్రమంలో దామోదర సంజీవయ్య మెమోరియల్ ట్రస్టు చైర్మన్ గంజి ఎజ్రా, ఎస్‌సి, ఎస్‌టి మోనటరింగ్ కమిటీ జిల్లా సభ్యులు దండాశి రాంబాబు, దాసరి తిరుమలరావు, దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు అంపోలు ప్రతాప్, బహుజన టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సీర రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శిక్షణా శిబిరం

మెళియాపుట్టి : పాల్గొన్న విద్యార్థులు

మెళియాపుట్టి: స్థానిక శాఖాగ్రంథాలయంలో వేసవి శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం క్యారమ్స్, చెస్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక శాఖాగ్రంథాలయ అధికారి ఆర్.అనురాధ, మణికంఠ, స్వాతి పాల్గొన్నారు.

టెక్కలి : విద్యార్థులు చదువుకునే వయసు నుంచే యోగాపై అవగాహన ఉండాలని గ్రంథాలయ అధికారి బి.రూపావతి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించి ఆసనాలు వేయించారు. కార్యక్రమంలో అమ్మఒడి పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లావేరు : ప్రతి విద్యార్థీ గ్రంథాలయంలో బాల సాహిత్యం పుస్తకాలు చదువుకోవాలని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. లావేరు శాఖాగ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులతో పుస్తకాలను చదివించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు జాతీయ నాయకుల జీవిత చరిత్రల పుస్తకాలు, బట్టి విక్రమార్క కథలు, తెనాలి రామలింగడు కథలు, చందమామ పాలమిత్రలో ఉన్న సంపుటలును విద్యార్థులు చదువుకోవాలన్నారు. గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు పాల్గొన్నారు.

శ్రీకాకుళం : వేసవి సెలవుల్లో చిన్నారులు కాలాన్ని వృథా చేయకుండా సెల్‌ఫోన్, టివి వంటి మాధ్యమాలకు బానిసలు కాకుండా సాంస్కృతిక, క్రీడలతో వినోదాన్ని పంచుకోవాలని విద్యావేత్త డాక్టర్ ముట్నూరు ఉపేంద్రశర్మ సూచించారు. జిల్లా కేంద్రగ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో ఆయన పాల్గొని చిన్నారుల్లో ఉత్సాహాన్ని నింపారు. వినోదాన్ని పొందడం ద్వారా విజ్ఞానాన్ని మానసిక ఉల్లాసాన్ని పొందడానికి చిత్రలేఖనం, నాట్యం, కథలు చెప్పడం వంటి అనేక మార్గాలు ఉన్నాయని అన్నారు. అనంతరం వివిధ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కథల పుస్తకాలను బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజా, ఉప గ్రంథాలయాధికారి వి.జి.ఎస్.శంకరరావు పాల్గొన్నారు.

మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అధికారులు

రైల్వేస్టేషన్ వద్ద మాక్ డ్రిల్

పలాస : జమ్ము-కాశ్మీర్ పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాదులు స్థావరాలపై దాడులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు మేరకు రైల్వేస్టేషన్ వద్ద వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు మాక్ డ్రిల్‌ను బుధవారం నిర్వహించారు. యుద్ధంలో శత్రువులకు దొరకకుండా ఎలా తప్పించుకోవాలి, దాడుల్లో గాయపడితే వారిని యుద్ధప్రాతిపదికన ఎలా చికిత్సకు తరలించాలి, సైరన్ మోగగానే ప్రజలు ఎలా అప్రమత్తం కావాలి అనేక అంశాలపై మాక్ డ్రిల్ నిర్వహించి ప్రజలను చైతన్యపరిచారు. కార్యక్రమంలో కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణ, జిఆర్‌పి ఎస్ఐ షరీఫ్, అగ్నిమాపక అధికారి సోమేశ్వరరావు, ఎంవిఐ అధికారి బాలాజీరావు, వెవెన్యూ టిటి లక్ష్మీనారాయణ, ఆర్.వి.ఖగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫాసిజంపై పోరాడాలి

పలాస : మన్యం వీరుడు, విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో మతోన్మాద ఫాసిజంపై పోరు సల్పాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు పిలుపునిచ్చారు. మండలంలోని మామిడిపల్లిలో అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి సభ బుధవారం నిర్వహించారు. తొలుత ప్రగతిశీల యువజన సంఘం పివైఎల్ జిల్లా కన్వీనర్ సారా జగన్ అల్లూరి విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం దేశానికి ఫాసిజం ప్రమాదంగా మారిందన్నారు. కగారు పేరుతో ఆదివాసీలపై సాగుతున్న నరమేధాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ నాయకులు జె.అప్పయ్య, ఎస్.జగన్, వి.పాపయ్య, కె.బాలకృష్ణ, కర్రి అప్పారావు, వంకల దానయ్య, నర్త దానేషు, సార నూకయ్య పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉదయ్

'ఈగల్' పోస్టర్ ఆవిష్కరణ

టెక్కలి రూరల్: టెక్కలిలోని ఆదిత్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఈగల్ క్లబ్ ఏర్పాటును పురస్కరించుకొని, ఆదిత్య ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి యూనిట్ల సహకారంతో మాదకద్రవ్యాలపై అవగాహన బుధవారం కల్పించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రస్థాయి ఈగుల్ అధికారులు ఉదయ్, రామచంద్రరావు పాల్గొని విద్యార్థులను మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కలిగిస్తూ చక్కటి ప్రేరణనిచ్చారు. అనంతరం ఈగల్ పోస్టల్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ డాక్టర్ శాంతికుమార్, అసోసియేట్ డీన్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మారుతి, బిఎస్‌హెచ్ విభాగాధిపతి డాక్టర్ ఎం.రమణయ్య పాల్గొన్నారు.

రూ.1.63 లక్షల ఆర్థికసాయం

పలాస : మండలంలోని బ్రాహ్మణతర్లకు చెందిన వైశ్యరాజు మణి ఇటీవల సోంపేట మండలం బారువ బీచ్ ఫెస్టివల్ వెళ్తున్నాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం శ్రీకాకుళంలో చికిత్స పొందుతున్నాడు. మణికు నయమం చేసేందుకు రూ.లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. విషయం తెలుసుకున్న హెల్పింగ్ వారియర్స్ బృందం ముందుకొచ్చి రూ.1,13,500, గ్రామానికి చెందిన కొంత మంది వ్యక్తులు రూ.50 వేలు ఆర్థికసాయం బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఎల్.వేణుగోపాల్, ఎస్.నరేష్, ఆర్.జె.ఈశ్వర్, పి.కార్తీక్, కె.అభి పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల పేరుతో దోపిడీ

ప్రజాశక్తి- కవిటి

మాట్లాడుతున్న నేతాజీ, ప్రకాష్

స్వయం ఉపాధిలో భాగంగా కుట్టు మిషన్ల పథకం పేరుతో రూ.257 కోట్లు కొట్టేయడానికి కూటమిలో కీలక నేత పథకం వేశారని ఇచ్ఛాపురం నియోజకవర్గం వైసిపి అధికార ప్రతినిధి పూడి నేతాజీ, కవిటి మండల వైసిపి అధ్యక్షుడు కడియాల ప్రకాష్ ఆరోపించారు. మండలంలోని జగతిలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇస్తామన్న పేరుతో దోపిడీకి పథక రచన చేశారని, ముఖ్యంగా టెండర్ల దశ నుంచే పక్కాగా తమ పథకం అమలు చేశారని ఆరోపించారు. ఈ పథకం విషయంలో మొదట వంద కోట్లతో ప్రతిపాదనలు పెట్ట తరువాత అమాంతం రూ.257 కోట్లకు అంచనాలు పెంచేశారని ఆరోపించారు. టెండర్ల కేటాయింపు మొదలు శిక్షణ కార్యక్రమం వరకూ అన్ని విభాగాల్లో దండుకోవడానికి వీలుగా పథక రచన చేశారన్నారు. తక్కువ కోట్ చేసిన కంపెనీకి టెండర్ కేటాయించకుండా మిగిలిన రెండు సంస్థలకు కాంట్రాక్ట్ ఇవ్వడం వెనుక మతలబు ఏమిటని వీరు ప్రశ్నించారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా, నిబంధనలకు విరుద్ధంగా రూ.25 కోట్లు ముందస్తు చెల్లింపునకు అంతా సిద్ధమైందని ఆరోపించారు. ఈ అంశంపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే విధంగా తమ పార్టీ అన్ని రకాలుగా సంసిద్ధంగా ఉందన్నారు.

జనగణమన స్ఫూర్తి ప్రదాత ఠాగూర్

ఠాగూర్ విగ్రహానికి అంజలి ఘటిస్తున్న నేతలు

శ్రీకాకుళం : దేశ జాతీయ గీతం జనగణమణ రచించి కోట్లాది మందిలో స్ఫూర్తిని నింపిన స్వాతంత్ర్య సమరయోధుడు రవీంద్రనాధ్ ఠాగూర్ అని వక్తలు కొనియాడారు. నగరంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతి వనంలో ఠాగూర్ 164వ జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. విగ్రహదాతలు శాలిహుండాం రవికుమార్, శ్రీదేవి, కమిటీ ప్రతినిధులు పాల్గొని పుష్పాంజలి ఘటించారు. గాంధీ మందిరం ప్రతినిధులు సురంగి మోహనరావు, జామి భీమశంకర్, ప్రొఫెసర్ విష్ణుమూర్తి, పైడి హరనాథరావు, నిష్టల నరసింహమూర్తి మాట్లడుతూ స్వాతంత్ర్యమంలో తన రచనలతో జాతి ఐక్యతకు కృషి చేశారన్నారు. గీతాంజలి అనే మహాకావ్యాన్ని రచించి భారతదేశ స్ఫూర్తిని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. దేశానికి జాతీయ గీతం అందించి ప్రతిఒక్కరిలో స్వాతంత్ర్య స్ఫూర్తిని నింపారన్నారు. ఉగ్రవాదులపై దాడులు జరుగుతున్న భారత సైన్యానికి ప్రతిఒక్కరూ బాసటగా నిలవాలని కోరారు. ముందుగా ఆర్మీ మేజర్ తారకేశ్వరరెడ్డి, ప్రీతమ్ రెడ్డిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ పైడి సిందూర, నటుకుల మోహన్, బరాటం లక్ష్మణరావు, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, పొన్నాడ రవికుమార్, కొమ్ము రమణమూర్తి, పందిరి అప్పారావు, బెందాళం వరలక్ష్మి, తమ్మినేని ఉషారాణి, పెంకి చైతన్య పాల్గొన్నారు.

'కూటమి పాలనలో అన్నీ స్కామ్‌లే'

ప్రజాశక్తి- పలాస

మాట్లాడుతూ వైసిపి నాయకులు

కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన 11 నెలల పాలనలో స్కామ్‌లు ఫుల్, స్కీమ్‌లు నిల్‌గా మారిందని వైసిపి నాయకులు బమ్మిడి దుర్యోధనరావు, ఉంగ సాయికృష్ణ, శిష్టు గోపిలు ఆరోపించారు. కాశీబుగ్గ ప్రగతిభవన్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. మాజీ సిఎం జగన్ ఐదేళ్ల పాలనలో గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యం సచివాయం వ్యవస్థ నుంచి ఎన్నో చారిత్రాత్మిక మార్పులు చేసి చూపించారని అన్నారు. 40 ఏళ్ల చరిత్ర అనే చెప్పుకునే చంద్రబాబు కుంభకోణాలు కనిపిస్తున్నాయని ఆరోపించారు. సంపద సృష్టిస్తామని చెప్పిన సిఎం చంద్రబబు ప్రజల సంపద ఆవిరి చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రయివేటు విద్యుత్ సంస్థ ద్వారా యూనిట్ ధర రూ.4.60 కొనుగోలు చేసి, ప్రజలపై రూ.211 లు అధనపు భారం మోపుతున్నారని అన్నారు. విద్యుత్ కొనుగోలులో తమ బినామి కంపెనీలకు అప్పగించి రూ.11 వేల కోట్లు కుంభకోణానికి పాల్పడ్డారని ఆరోపించారు. అందులో కూడా సీలింగ్ పేరును చేర్చి ధర తగ్గినప్పుడు తగ్గించే విధంగా కాకుండా పెంచుకునే విధంగా చేశారన్నారు. కుట్టుమిషన్లు పంపిణీ అంటూ టెండర్లు పిలిచి తమకు అనుకులంగా ఉన్న బినామి సంస్థలు మూడింటిని ఎంపిక చేశారని అన్నారు. దీనిని ప్రజలంతా గ్రహిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. సమావేశంలో బత్తిన హేమేశ్వరరావు, దువ్వాడ రవి, ఎన్.షణ్ముఖరావు, బొడ్డు సుధాకర్ పాల్గొన్నారు.

నవధాన్యాలతో నేల సారవంతం

సిద్ధంగా ఉన్న నవధాన్యాల కిట్లు

ప్రజాశక్తి- రణస్థలం

నవధాన్యాల సాగుతో నేల సారవంతమవుతుందని ఎఓ విజయభాస్కరరావు, మండల వ్యవసాయ విస్తరణ అధికారి ఎం.సునీత, ఐసిటి ఎన్ఎఫ్ ఎ.శివకృష్ణ అన్నారు. మండలంలోని వేల్పురాయి రైతు సేవా కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో నేలను సారవంతం చేయడానికి 2200 ఎకరాలకు సరిపడా నవధాన్యాలు కిట్లను బుధవారం తయారు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎకరాకు 25 రకాల 12 కిలోల విత్తనాలను వేసుకోవాలన్నారు. 45 నుంచి 60 రోజులు పాటు బాగా పెరగనిచ్చి పశువులు మేతగా కోసుకొని మిగిలిన పచ్చి రొట్టెను నేలలో కలియ దున్నాలని పేర్కొన్నారు. దీంతో పంటకు కావాలసిన పోషకాలను సమృద్ధిగా నేలలో వృద్ధి చేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ కృష్ణ, ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

బ్యాగు అప్పగింత

ప్రజాశక్తి- పలాస

బ్యాగ్‌ను అందజేస్తున్న జిఆర్‌పి పోలీసు

రైలులో ప్రయాణిస్తూ... హ్యాండ్ బ్యాగ్ మరిచిపోయిన బాధితురాలికి జిఆర్‌పి పోలీసులు బుధవారం అప్పగించారు. రైలు నెం 07165 రైలులో ప్రయాణికులు ఎ2 కోచ్ బెర్త్ నంబరు 11లో ప్రయాణిస్తున్నారు. తలగడ కింద హ్యాండ్ బ్యాగ్ పెట్టి శ్రీకాకుళం రోడ్డులో హ్యాండ్ బ్యాగును మరిచిపోయి దిగిపోయారు. అనంతరం శ్రీకాకుళం జిఆర్‌పి పోలీస్‌స్టేషన్‌లో సెంట్రీగా ఉన్న శశికుమార్‌కు బాధితురాలు ఫిర్యాదు చేశారు. ఆయన పలాస జిఆర్‌పి పోలీసులకు ఫోన్‌లో సమాచారం అందించి అప్రమత్తం చేశారు. పలాస జిఆర్‌పి హెచ్‌సి సోమేష్, మహిళా కానిస్టేబుళ్లు భానుమతి, లత, అనితలు రైలు వద్దకు వెళ్లి హ్యాండ్ బ్యాగును గుర్తించి స్టేషన్‌కు తీసుకొచ్చి బాగ్‌ను అందజేశారు. అందులో రెండున్నర తులాల బంగారం వస్తువులు ఉన్నాయి.

ఎమ్మెల్యే పరామర్శ

కొత్తూరు : ఇటీవల మండల కేంద్రంలో కొత్తపేట కాలనీలో కోదాడ పద్మ ఇళ్లు అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు బుధవారం కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రూ.పది వేలు ఆర్థికసాయం, బియ్యం పాకెట్‌ను అందజేశారు. నూతన ఇల్లు మంజూరుకు కృషి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈయనతో పాటు టిడిపి నాయకులు మాతల గాంధీ, ఆగతముడి అరుణ్‌కుమార్, బి.రాజు, టొంపల తిరుపతిరావు, చొడవరపు రాము, ముగిత కృష్ణ, ల్మోణరావు, జి.ధర్మారావు ఉన్నారు.

ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు

కొనసాగుతున్న ఆందోళన

ఇచ్ఛాపురం : తమ డిమాండ్ల పరిష్కారానికి మున్సిపల్ కాంట్రాక్టు ఉద్యోగుల చేపట్టుతున్న ఆందోళన బుధవారం రెండో రోజు కొనసాగింది. మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన స్థానిక మస్టర్ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు, కాంట్రాక్టు ఉద్యోగులు నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అంతకు ముందు సమ్మె నోటీసును మున్సిపల్ మేనేజర్ అప్పలస్వామికి అందజేశారు. కార్యక్రమంలో రమేష్ కుమార్ పట్నాయక్, మంగళ్ సత్తు, గంగాధర్ రాతో, తాతారావు, ఢిల్లీ, లక్ష్మణరావు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న తేజేశ్వరరావు

బగడ సాగరం సందర్శన

మెళియాపుట్టి: మండలంలోని బగడ వద్ద ఉండే బగడ సాగరాన్ని బిజెపి జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు బుధవారం సందర్శించారు. స్థానిక గ్రామ రైతులు సాగునీటి సమస్యపై ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సాగరం నుంచి నీరు వెళ్లే మార్గం పాడైనందున సాగునీరు సక్రమంగా సరఫరా అవ్వడం లేదని, కెనాల్ అభివృద్ధి చేస్తే ఈ సాగరం పరిధిలోని ఐదు పంచాయతీల గ్రామ రైతులకు సాగునీటి సమస్య తీరుతుందని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తాను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తన వంతు సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. ఈయనతో పాటు భూపతిరావు, మాజీ సర్పంచ్ నిక్కల బాబూరావు ఉన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహం

కవిటి: ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 500 మార్కులు దాటించి వచ్చిన శ్రీశయన సామాజిక తరగతి చెందిన విద్యార్థులకు బుధవారం యువజన సంఘం సత్కరించింది. శ్రీశయన చైతన్య యువజన సంఘం రాజపురం వారి ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాజపురంలో చదివి 570 మార్కులతో పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచిన పర్రి వినయ్, 500 మార్కులు దాటిన ఆనింగి అనూష, పర్రి మధు, పర్రి గణేష్‌లకు చిరు సత్కారించారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శ్రీచైతన్య యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులను సత్కరిస్తున్న సంఘ సభ్యులు